క్లుప్తంగా

సన్మానం

మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గ శక్తి సూపర్ షీ కో ఆర్డినేటర్‌గా రాజేశ్వరి(వైశాలి) ఇటీవల నియామకం కాగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఆమె మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను శాలువాతో సన్మానించారు. అన్ని గ్రామాల్లో శక్తి సూపర్ షీ కోఆర్డినేటర్లను నియమించే దిశగా యువజన కాంగ్రెస్ శక్తి సూపర్ షీ పనిచేస్తుందని ఆ విధంగా పనిచేయడానికి కావాల్సిన సహాయ సహకారాలను అందించాలని ఎమ్మెల్యేను కోరారు. యువజన కాంగ్రెస్ మహిళలను రాజకీయంగా సమాజంలో ముందంజలో ఉంచడానికి అనేక రకాలుగా కృషి చేస్తుందని ఆమె తెలిపారు.

వడదెబ్బపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్ గ్రామంలో వావిలాల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు వడదెబ్బపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో పనిచేసే చోట ఉపాధి కూలీలు టోపీ, కాటన్ దుస్తులు ధరించాలని, ఎక్కువ నీరుతాగాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్ఎం సౌందర్య, మంజుల, ఫీల్డ్‌అసిస్టెంట్ సుధాకర్, ఆశాలు, కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల తొలగింపు

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామ పెద్ద చెరువులో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను విద్యుత్, రెవెన్యూ సిబ్బంది మంగళవారం తొలగించారు. చెరువు చుట్టుపక్కల రైతులు చెరువులోకి వర్షపు నీరు రాకుండా ఎత్తుగా మట్టిపోశారని, వచ్చిన కొద్దిపాటి నీటిని గుంతలు తవ్వి మోటార్లతో తరలిస్తున్నారని మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు ఫిర్యాదుతో మోటార్లను తొలగించామన్నారు.

రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీధర్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం రైతు వేదికలో మంగళవారం పురుగు మందుల డీలర్లకు వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీధర్ ఆన్‌లైన్‌లో పురుగు మందుల నమోదుపై అవగాహన కల్పించారు. మండలంలోని ఫర్టిలైజర్ దుకాణ యజమానులు, సహకార సంఘం గోదాముల్లో పురుగుమందులు విక్రయిస్తున్న వారికి ఆన్‌లైన్‌లో నమోదు, రికార్డుల నిర్వహణ, స్టాక్, ఇతర రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటేశ్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు చేపట్టాలి

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి, ఆరెపల్లి, జాగీర్‌పల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో సాగునీటి కాలువల మరమ్మతు పనులు చేపట్టాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటలు ఎండుతున్నాయని మండలంలోని రైతులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, వెన్నంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ రాజిరెడ్డి, మారుపాక తిరుపతికి తెలిపారు. వెంటనే నాయకులు మంగళవారం ఫోన్ ద్వారా మంత్రికి విషయం తెలియజేశారు. స్పందించిన మంత్రి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి యాసంగి పంటల కోతలు పూర్తయిన తర్వాత కాలువ పనులు చేపడతామని, వచ్చే వానాకాలం వరకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని డీఈ సదయ్య తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన మండల ప్రశాంత్, కొడారి ప్రశాంత్ ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని వివరించారు.

చికిత్స పొందుతూ మృతి



కర్ణాకర్(ఫైల్)

సైదాపూర్: మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన బొడిగె కర్ణాకర్ (38) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు సైదాపూర్ ఎస్ఐ తిరుపతి తెలిపారు. కర్ణాకర్‌పై ఆకునూర్‌కు చెందిన పలువురు ఈ నెల 9న దాడి చేశారు. అవమానంగా భావించి మనస్తాపానికి గురై పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదుతో కేస్ నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలోని తుమ్మెదల గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవం నంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి గుట్టపై వెలిసిన స్వయంభూ శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. చుక్కా అరుణరాణి-రంజిత్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయకమిటీ చైర్మన్ చిట్ల చంద్రమౌళి దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఆవరణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అర్చకులు ప్రదీప్‌శర్మ, నవీన్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణలు మేళతాళాల నడుమ స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, మహాన్నదానం చేపట్టారు. చిన్నకోమటిపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవం తిలకించారు. భక్తులు స్వామివారికి కట్నకానుకలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన చుక్కా రంజిత్ భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో సుమారు రూ.పదిలక్షలతో కల్యాణ మండపం నిర్మించి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్ల సరోజన నాగన్న, వైస్‌చైర్మన్ మూడెడ్ల రమేశ్, ధర్మకర్తలు చిట్ల శ్రీనివాస్, మూడెడ్లె రమేష్, శ్రీనివాస్, ల్లి శేషు, బుర్ర రఘు, శంకర్, రమేశ్, రాజయ్య, నాయకులు చుక్క వేణుగోపాల్, దేశిని కోటి, దిలీప్‌రెడ్డి, మహేందర్ తదితరులున్నారు.



ఇల్లందకుంట: తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



గంగాధర: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సుదర్శన నారసింహ హోమం

రామడుగు: మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం సుదర్శన నారసింహ హోమం వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిత్యహోమం, తీర్థ ప్రసాద గోష్టి, బలిహరణ చేపట్టారు. హోమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ సరోజన, భక్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో బుధవారం నుంచి పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 12న పోచమ్మ బోనాలు, 13 నుంచి రెండు రోజులపాటు హోమాది కార్యక్రమాలు, 15న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, అదే రోజు సాయంత్రం పెద్దమ్మ బోనాలు, అన్నదానం, 16న ఒడిబియ్యం కార్యక్రమాలుంటాయని సొసైటీ అధ్యక్షుడు గూల్ల బాలయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గూల్ల కనుకయ్యలు తెలిపారు. కార్యక్రమం మాధవానంద సరస్వతి స్వామి, జక్కి కృష్ణ అవధానిల ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఆలయ నిర్మాణం కోసం తొమ్మిది గుంటలు విరాళంగా ఇచ్చిన మాజీ సర్పంచ్ కాంతాల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు రూ.80 లక్షలతో ఆలయాన్ని నిర్మించామన్నారు.



గంగాధర: లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



చిగురుమామిడి: నూతన ఆలయం ఎదుట ముదిరాజ్‌లు





ఇల్లందకుంట: కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న రంజిత్, రామడుగులో హోమం నిర్వహిస్తున్న పండితులు

విద్యా వ్యవస్థను బీఆర్ఎస్ పట్టించుకోలేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: ప్రపంచాన్ని మార్చగల శక్తి విద్యకు మాత్రమే ఉందని, సామాన్యుడు సమాజంలో గొప్ప వ్యక్తిగా ఎదగడానికి తోడ్పాటునిచ్చేది చదువు మాత్రమేనని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా చొప్పదండి నియోజకవర్గానికి రూ.రెండు వందల కోట్లు మంజూరు కాగా మంగళవారం సాయంత్రం గంగాధర మైనారిటీ బాలికల పాఠశాలలో అధికారులు కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలోని విద్యార్థులందరికి ప్రపంచ స్థాయి విద్యను అందించడానికి ముఖ్యమంత్రి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నారని, పదేళ్లపాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందని, విద్యార్థులు గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ సురేశ్, ప్రిన్సిపాల్ వారుణి, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించాలి



మాట్లాడుతున్న దేవేందర్ రెడ్డి

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం చొరవతీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ముసుగులు తొలగించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష మంగళవారంతో రెండో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని దేవేందర్‌రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంకల్పంతో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించకుండా ఓ ఉన్నతాధికారి అడ్డుకోవడంతో సమస్యకు పరిష్కారంకావడం లేదన్నారు. నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బోయిని కొమురయ్య, మాతంగి లక్ష్మణ్, కనకం రాములు, పొన్నం అనిల్, పాశం అశోక్ రెడ్డి, గుజ్జుల ప్రణీత్ రెడ్డి, చింతం శ్రీనివాస్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బూట్ల శ్రీనివాస్ దీక్షకు మద్దతు ప్రకటించారు. జేఏసీ కన్వీనర్లు దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, అంబాల సతీశ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు ఎల్కపల్లి సంపత్, సముద్రాల లక్ష్మణ్, పార్నంది జలపతి, ఉప్పులేటి రాజు, తాటిపెల్లి సంపత్, కొయ్యడ మురళి, గాజ సాగర్, అలువాల కుమార్, కామెర వెంకటేష్, చెన్నబోయిన రవి, మాతంగి రాజమల్లు, జేజేల సంపత్, కొమ్ము సంపత్, గొల్లపెల్లి మల్లేశం గౌడ్, తుర్పాటి అజయ్, ఇనుకొండ నరేష్, అలువాల రాజశేఖర్, మేకల మహేష్, పబ్బ తిరుపతి పాల్గొన్నారు.

గడువులోపు చెల్లిస్తే రాయితీ

హుజూరాబాద్ : మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం 25 శాతం రాయితీని కల్పిస్తోందని అవకాశాన్ని అర్హులు ఈ నెల 31 లోపు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సమ్మయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై అధికారులతో లేఅవుట్ ప్లానర్స్‌తో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు మార్చి నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించాలని గడువులోగా చెల్లించిన వారికి ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని, ఒకవేళ రుసుము చెల్లించిన వారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే చెల్లించిన డబ్బులు పదిశాతం తగ్గించి మిగతా డబ్బులు కట్టిన వారి అకౌంట్‌లోకి పంపించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, టీపీవో అశ్వినిగాంధీ, వినయ్, ప్లానర్ నలువాల వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సమ్మయ్య

16 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో 16 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలు జరగనున్నాయని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సర్దార్ సురేందర్ సింగ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హుజూరాబాద్ ప్రాంత క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పథకాలు సాధించారని, రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలన్నారు.హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలకు హాకీ క్లబ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, శాశ్వత అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, హాకీ క్లబ్ ఉపాధ్యక్షులు భూసారపు శంకర్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, సీనియర్ క్రీడాకారులు గుడ్డెలుగుల సమ్మయ్య, చింత శ్రీనివాస్, తిరుపతి, తిరునగరి శ్రీనివాస్, వినయ్, రోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్‌సింగ్

కేసు నమోదు

గన్నేరువరం: మండలంలోని ఓ కాంట్రాక్ట్ మహిళ ఉద్యోగి పట్ల అసభ్య వ్యవహరించిన వ్యక్తితో పాటు ఆరుగురు పాత్రికేయులపై ఉద్యోగి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తాండ్ర నరేష్, ఏఎస్సై రాధాకిషన్ తెలిపారు. మాదాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చేయి పట్టుకొని అసభ్యంగా వ్యవహరించాడని, మండలానికి చెందిన ఆయా ప్రధాన పత్రికల విలేకర్ల ప్రోద్బలంతోనే మహిళ అని చూడకుండా చెడుగా ప్రవర్తించాడంతోపాటు వేధింపులకు గురి చేస్తున్నాడని వీరందరితో ప్రాణహాని ఉందని, వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై, ఏఎస్సై తెలిపారు.

గడువు పొడిగింపు



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచిందని ప్రిన్సిపాల్ సరిత ప్రకటనలో తెలిపారు. 6వ, తరగతిలో వంద, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యజమానులు

చొప్పదండి: కేంద్రం ప్రకటించిన జీఎస్టీ ధరల పెంపుతో ముడిసరుకుల రేట్లు పెరిగినందున ఫ్లెక్సీ ప్రింటింగ్ గిట్టుబాటు కాకపోవడంతో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ప్రింటింగ్ నిలిపివేస్తున్నామని ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈమేరకు చొప్పదండి ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 42 యూనిట్ల యజమానులు నిర్ణయం తీసుకున్నారని, కస్టమర్లు సహకరించాలని కోరారు. పట్టణంలోని ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ



డిక్షనరీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రామడుగు: మండలంలోని వెదిర జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు-ఇంగ్లిష్ డిక్షనరీలు, మోటివేషన్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన రీజియన్ సెక్రటరీ కోట సత్యం, అధ్యక్షుడు చెన్నమనేని రామ్మోహన్‌రావు, ప్రతినిధులు మేచినేని సత్యనారాయణరావు, నడిపల్లి ప్రసాద్‌రావు, సురేందర్, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం



హుజూరాబాద్: మండలంలోని కాట్రపల్లికి చెందిన కోమటి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా నియమిస్తూ మంగళవారం మండలాధ్యక్షుడు కొల్లూరి కిరణ్ నియామక ఉత్తర్వులు అందించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.



రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో రోడ్డుపై మురుగునీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇకనైనా స్పందించి రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రావణ్‌కుమార్, ఎంపీవో, రామడుగు, సెల్ నంబర్: 9291241882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన

చిగురుమామిడి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు నగదు విత్‌డ్రా, జమచేయడానికి ఆన్‌లైన్ పద్ధతిని అవలంబించాలని ఆర్ఎం బి. బాలనాగు అన్నారు. మంగళవారం మండలంలోని ఇందుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులకు ఆన్‌లైన్ చెల్లింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఫోన్ పే, గూగుల్ పే, యూపీఐల ద్వారా లావాదేవీలు చెల్లించడంతోపాటు ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని టీజీ బ్యాంకు నుంచి వ్యవసాయానికి మార్టిగేజ్, హౌసింగ్ రుణాలు కూడా ఇస్తున్నామని అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇందుర్తి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అతుల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సుమంత్‌లక్ష్మి, మాజీ సర్పంచ్ రాజు, సీఏలు బుర్ర శోభ, కత్తి రమాదేవి, లక్ష్మి, జర్నలిస్టు రఘునాథరెడ్డి, బ్యాంకు సిబ్బందితో పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి

మానకొండూర్: కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా ఈదులగట్టెపల్లి స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లేలా సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో ఇటీవల గ్రామస్తులు నేషనల్ హైవే 563 రహదారి పనులను అడ్డుకున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయి. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేషనల్ హైవే సైట్ ఇంజినీర్ కృష్ణ మంగళవారం ఈదులగట్టెపల్లి స్టేజీ వద్దకు చేరుకొని స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు సమస్యను వివరించారు. కరీంనగర్ నుంచి నేరుగా ఈదులగట్టెపల్లి గ్రామానికి వచ్చేలా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం లేదని, స్టేజీ వద్ద ఆర్డీనరీ బస్సులు ఆగేలా రెండు వైపుల స్టేజీలు లేకుండా పోయాయని, ప్రయాణికులు ఎక్కడ ఆర్డీనరీ బస్సులు ఎక్కాలని, కరీంనగర్, హుజూరాబాద్, వరంగల్, గద్దపాక, అర్కండ్ల, కట్కూర్ ప్రాంతాల ప్రయాణికులు స్టేజీ లేనప్పుడు ఎక్కడి వెళ్లి బస్సులు ఎక్కాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద రెండు వైపులా సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని, అలాగే ఆర్డీనరీ బస్సులు స్టేజీ వద్ద నిలిచేలా బస్టాప్ నిర్మాంచాలని కోరారు. పెట్రోలుబంకు సైడ్ నుంచి వస్తున్న వరద గతంలో చెరువులోకి వెళ్లేదని నూతనంగా నిర్మిస్తున్న 563 రోడ్డుతో వరద సబ్‌స్టేషన్ వైపు నుంచి కాకతీయ కాలువలోకి వెళ్లేలా చేపడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి ప్రాంతంలో సీసీ వేయాలని అలాగే భారీ వాహనాలు ఈదులగట్టెపల్లి మీదుగా వెళ్లేలా బ్రిడ్జిని తాకకుండా చర్యలు చేపట్టాలని వరద చెరువులోకి వెళ్లేలా చూడాలని గ్రామస్తులు కోరారు. గ్రామస్తుల సమస్యలు విన్న సైట్ ఇంజినీర్ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

తడిపొడితో అధిక దిగుబడి

చొప్పదండి: తడిపొడి విధానంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని రైతువేదికలో మంగళవారం వరి పంటలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. వరిలో కీటకాల వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సెమినార్

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నామని శాతవాహన యూనివర్సిటీ హెచ్‌వోడీ హరికాంత్ మంగళవారం తెలిపారు. డిజిటల్ పరివర్తన: స్థిరమైన వ్యాపార అభివద్ధికి కీలకమైన ఉత్ప్రేరకం అనే అంశంపై చర్చించడానికి ప్రఖ్యాత నిపుణులు, అధ్యాపకులు, రిసెర్చ్ స్కాలర్స్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు.